



# కరపత్రం

SINCE 2014

గురువారం ఆగస్ట్ 28 2025 | సంపుటి :0 | సంచిక :312 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## అప్రమత్తంగా ఉండి ప్రమాదాలు నివారించండి..

# భారీ వర్షాలపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పురాతన ఇళ్లలో ఉంటున్న వారిని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సీఎం సూచించారు. హైదరాబాద్‌లో కూడా వర్షం దంచికొట్టడంతో హైడ్రా, ఎస్‌డీఆర్‌ఎఫ్, జీహెచ్‌ఎంసీ, అగ్నిమాపక, పోలీసు శాఖను అప్రమత్తం చేశారు. అందరూ కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వినాయక చవితి సందర్భంగా మండపాల వద్ద విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉంటే భక్తులకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ట్రాన్స్‌కో సిబ్బందిని ఆదేశించారు. నదులు, వాగులపై ఉన్న లోతట్టు కాజ్‌వేలు, కల్వర్టులపై నుంచి నీటి ప్రవాహాలు ఉంటే రాకపోకలు నిలిపివేయాలని సీఎం ఆదేశించారు. చెరువులు, కుంటలకు గండిపడే ప్రమాదం ఉన్నందున నీటిపారుదలశాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున నగరపాలక, పురపాలక, గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి నిల్వ నీటిని తొలగించడంతో పాటు ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఆసుపత్రుల్లో సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.



- పాత ఇళ్లలో నివసిస్తున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.
- వరదల పరిస్థితిని ఎదుర్కొనేందుకు హైడ్రా, ఎస్‌డీఆర్‌ఎఫ్, జీహెచ్‌ఎంసీ, అగ్నిమాపక, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేయాలి.
- వినాయక చవితి మండపాల వద్ద విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో భక్తులకు ప్రమాదాలు జరగకుండా ట్రాన్స్‌కో సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలి.
- నదులు, వాగులపై ఉన్న లోతట్టు కాజ్‌వేలు, కల్వర్టుల మీద నుంచి నీరు ప్రవహిస్తుంటే రాకపోకలను నిలిపివేయాలి.
- చెరువులు, కుంటలకు గండ్లు పడకుండా నీటిపారుదల శాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

## తెలంగాణలో భారీ వర్షాలు..

పలు రైళ్ల రద్దు, మరికొన్ని దారి మళ్లింపు



2లో ▸

## వరద నీటిలో చిక్కుకున్న వారికి డ్రోన్ల సాయంతో ఆహారం చేరవేత



2లో ▸


సిరిసిల్ల: రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్ని ప్రాజెక్టులకు వరద ప్రవాహం పెరుగుతోంది.



## విద్యుదాఘాతంతో యువకుడు మృతి..

- చరణ్ మరణం పట్ల పవన్ కళ్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.
- చరణ్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుని భరోసా ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

## పవన్ కళ్యాణ్ విచారం




అమరావతి, : వాలీబాల్ ఆడటానికి పోల్స్ నిలబెడుతున్న సమయంలో ఆకస్మాత్తుగా విద్యుత్ ప్రసారమై కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం మూలపేటలో ఏడిద చరణ్ అనే యువకుడు మృతిచెందాడు. ఈ ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చరణ్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నట్లు పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకొని భరోసా ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు పవన్ కల్యాణ్. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.


ఈ ప్రమాదంలో మరో ఆరుగురు యువకులు గాయపడ్డారని అధికారులు చెప్పారని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పుకొచ్చారు పవన్. బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలని సూచించారు. క్రీడా ప్రాంగణాల్లో, పని ప్రదేశాల్లో పోల్స్ లాంటివి నిలిపేటప్పుడు, ఎత్తైన ప్రదేశాల్లో నిర్మాణాలు చేపట్టే సమయంలో విద్యుత్ షాక్‌కు ఆస్కారం లేకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏ దశలోనూ అశ్రద్ధ వహించొద్దని, ప్రమాదాలు సంభవిస్తే కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన చెందుతారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని పవన్ కల్యాణ్ కోరారు.

## దొంగ ఓట్లు ఉంటే విచారణ జరిపించండి..

## బండి సంజయ్ VS మంత్రి పొన్నం



- ఓట్ల కోసం మాత్రమే బీజేపీ దేవుడిని, మతాన్ని రాజకీయాల్లోకి తీసుకొస్తుందని మంత్రి పొన్నం అన్నారు.
- ఓట్ల చోరీపై దమ్ముంటే బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసి విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.
- తెలంగాణలో కూడా 8 మంది బీజేపీ ఎంపీలు ఓట్ల చోరీతోనే
- గెలిచి ఉండొచ్చని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన అభిప్రాయాన్ని మంత్రి ప్రస్తావించారు.



హైదరాబాద్: భాజపా ఓట్ల కోసం మాత్రమే భగవంతుడిని వాడుకుంటుందని, రాజకీయాల్లోకి తీసుకొస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ గంగాధరలో నిర్వహించిన జనహిత పాదయాత్రలో మాట్లాడుతూ.. తెలంగాణలో కూడా 8 మంది భాజపా ఎంపీలు ఓట్ల చోరీతోనే గెలిచి ఉండొచ్చన్న అభిప్రాయం వెలిబుచ్చారని చెప్పారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కు ధైర్యం ఉంటే రాష్ట్రంలో ఎక్కడెక్కడ దొంగ ఓట్లు ఉన్నాయో ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఓట్ల చోరీ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షించాలని టీపీసీసీ చీఫ్‌తోపాటు సీఎంను మంత్రి పొన్నం కోరారు. తెలంగాణ ప్రభుత్వం బలహీన వర్గాలకు న్యాయం చేయడానికి రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ల చట్టం చేస్తే.. మతం పేరు చెప్పి భాజపా అడ్డుపడుతోందని ఆరోపించారు. ఆర్. కృష్ణయ్య ధర్నా చేయడం విడ్డూరంగా ఉందని మంత్రి పొన్నం అన్నారు.

## గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో భారీ వర్షం..

## స్తంభించిన జనజీవనం


గజ్వేల్ గ్రామీణం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ ఊరు చెరువు నిండుకొని అలుగు పారడంతో వరద నీరంతా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రహదారిపైకి చేరింది.



2లో ▸

## ప్రాణం తీసిన రీల్స్ సరదా.. బైక్‌పై స్టంట్లు చేస్తూ విద్యార్థులు మృతి

2లో ▸



కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం ఆగస్ట్ 28 2025

# సంపాదకీయం

## నేరచరితుల ఆటకట్టు సాధ్యమేనా

నీకెంత సేన ఉన్నా వ్యూహం లేకపోతే నీవు జనరల్ కాలేవు..' అన్న ఒక సైనిక నిపుణుడి ఉవాచ రాజకీయాలకు కూడా వర్తిస్తుంది. రాజకీయాల్లో వ్యూహరచన చేసే విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ అంత సిద్ధహస్తుడు మరొకరు లేరు. 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఆయన ఇప్పటి నుంచే సిద్ధపడుతున్నారని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొద్ది రోజుల క్రితమే వెల్లడించారు. దీన్నిబట్టి చూస్తే వచ్చే సెప్టెంబర్ నెలాఖరులో షెడ్యూలు ప్రకటించబోతున్న బిహార్ ఎన్నికలకు ఆయన ఎంత ముందుగా సన్నాహాలు చేసి ఉంటారో వేరే చెప్పనక్కర్లేదు. సాధారణంగా ఏవైనా ఎన్నికలకు ముందు పార్లమెంట్ సమావేశాలు పెద్దగా జరిగే అవకాశాలు లేవు. పార్లమెంట్‌లో లేవనెత్తే అంశాలే తర్వాత జరగబోయే ఎన్నికలకు ప్రధాన ప్రచారాస్త్రాలవుతాయని అటు అధికార పక్షానికీ, ఇటు ప్రతిపక్షాలకూ తెలుసు. ఆపరేషన్ సిందూర్‌పై చర్చను తమకు అనుకూలంగా తిప్పుకోవాలని మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తే బిహార్‌లో ఓటర్ల జాబితా విస్తృత సవరణ, గత మేలో పాకిస్థాన్‌పై ప్రారంభించిన యుద్ధాన్ని ఆకస్మికంగా విరమించడం లాంటి అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తాయి. ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేసేందుకు కాంగ్రెస్ 'ఓట్ చోరీ' ఆరోపణను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. దీనితో మోదీ ప్రభుత్వం తన వ్యూహరచనపై పునరాలోచనలో పడ్డది. నిజానికి ఆగస్టు 12నే ఉభయ సభలను వాయిదా వేయాలని తొలుత నిర్ణయం తీసుకుని ఆ విషయం ఫ్లోర్ నేతల సమావేశంలో తెలియజేశారు. కాని మోదీ, షా ఏమి ఆలోచించారో కానీ ఆమోదించాల్సిన బిల్లులేవీ లేకున్నా యథా ప్రకారం ఆగస్టు 21 వరకు పార్లమెంట్‌ను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 19 రాత్రి పొద్దుపోయిన తర్వాత ఉన్నట్లుండి 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, అందుకు సంబంధించిన ఇతర బిల్లులను మరునాడు ప్రవేశపెట్టనున్నట్లు బులెటిన్ విడుదల చేశారు. పార్లమెంట్ సభ్యులు అందరికీ బిల్లుల ప్రతిని పంపారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులు అయిదేళ్లపాటు శిక్షపడదగిన నేరానికి అరెస్టయి నెలరోజులపాటు జైలులో ఉంటే రాజీనామా చేయాలని, లేకపోతే వారు ఆ పదవులను కోల్పోయినట్లేనని ఈ బిల్లు సారాంశం. ఇప్పటి వరకూ మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రిని పోస్టుల నుంచి తొలగించేందుకు చట్టపరమైన నిబంధనలేవీ లేవు. లిల్లీ థామస్ కేసులో ఎమ్మెల్యే, ఎంపీలకు రెండేళ్లు, అంతకు మించి శిక్ష పడితే వారు సభ్యులుగా కొనసాగకూడదని 2013లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఈ కేసు ఆధారంగానే గుజరాత్‌లో సూరత్ కోర్టు ఒక పరువు నష్టం కేసులో రాహుల్‌గాంధీకి రెండేళ్ల శిక్ష విధించడంతో ఆయన సభ్యత్వాన్ని కోల్పోవాల్సి వచ్చింది.

అసలీ బిల్లును ఇంత ఆగమేఘాలపై ఎందుకు ప్రవేశపెట్టాల్సి వచ్చింది? జమిలి ఎన్నికల వంటి ముఖ్యమైన అంశంపై అఖిలపక్ష సమావేశాల్లో చర్చించిన ప్రభుత్వం ప్రధాన పదవుల్లో ఉన్నవారి నేర చరిత్ర గురించి రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టే ముందు ఎవరితోనూ చర్చించనవసరం లేదా? అందుకోసం కనీసం కేబినెట్ సమావేశంలోనైనా చర్చ జరిగిందా? అన్న ప్రశ్నలకు జవాబులు లేవు. అసలీ దేశంలో ప్రధానమంత్రులను కేంద్ర సంస్థలు ఎప్పుడైనా అరెస్టు చేసే అవకాశాలున్నాయా? అన్నది ఆసక్తికరమైన ప్రశ్న. విచిత్రమేమంటే కస్టడీ నుంచి విడుదలైన తర్వాత మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి, మళ్లీ పదవులు స్వీకరించేందుకు ఎలాంటి అడ్డంకులూ లేవని కూడా ఈ బిల్లు పేర్కొంటోంది. అటువంటప్పుడు ఈ బిల్లు ప్రవేశపెట్టడం వల్ల ప్రయోజనమేమిటి?

ఈ బిల్లుకు ప్రచారం కంటే పెద్ద ప్రయోజనం లేదని అధికారపక్షానికి తెలియనిది కాదు. బిహార్‌లో ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నందువల్ల దాన్నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ బిల్లు ప్రవేశపెట్టారన్న విశ్లేషణలూ లేకపోలేదు. ప్రభుత్వం ఊహించినట్లుగానే బిల్లుపై ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయి. తద్వారా అవినీతిపై తాము చేస్తున్న పోరాటాన్ని వారు వ్యతిరేకిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్ షా, ఇతర నేతలు ఆరోపించేందుకు ఆస్కారం కలిగింది. ఏమైనా ఈ నేపథ్యంలో బిహార్ ఎన్నికలు ఆసక్తికరంగా మారనున్నాయనడంలో సందేహం లేదు. రాహుల్‌గాంధీ ఇప్పటికే యాత్రలు ప్రారంభించి ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెట్టారు. పహల్గాం దాడి కాగానే మోదీ కూడా బిహార్‌కే వెళ్లి పాకిస్థాన్‌కు బుద్ధి చెబుతానని ప్రకటించారు. ఆపరేషన్ సిందూర్‌కు తోడు రాజ్యాంగ సవరణ బిల్లు కూడా ప్రతిపక్షాలను ఎండగట్టేందుకు మోదీ సేన ఉపయోగించుకుంటుందనడంలో సందేహం లేదు. రాజ్యాంగ సవరణ బిల్లు పట్ల ప్రతిపక్షాలు ఆందోళన చెందేందుకు కారణాలు లేకపోలేదు. ప్రతిపక్ష పార్టీల ప్రభుత్వాలను కుప్పకూల్చేందుకు కేంద్రం సీబీఐ, ఈడీ వంటి కేంద్ర ఏజెన్సీలను తప్పక ఉపయోగించుకోగలదని విపక్షాలు గట్టిగా విశ్వసిస్తున్నాయి. మనీలాండరింగ్ చట్టం ప్రకారం ఒక ముఖ్యమంత్రిని కానీ, మంత్రిని కానీ అరెస్టు చేస్తే వారికి 30 రోజుల వరకు బెయిల్ దొరికేందుకు అవకాశం లేదు. అదే అదనుగా వారిని తొలగించవచ్చు. ముఖ్యమంత్రిని అరెస్టు చేస్తే అధికారంలో ఉన్న ప్రభుత్వం కుప్పకూలిపోతుందని లేదా అధికారంలో ఉన్న పార్టీలో లుకలుకలు బయలుదేరుతాయనేది కూడా ప్రతిపక్షాల వారి ఆందోళన. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీలో పలువురు నేతలు ముఖ్యమంత్రి పదవికోసం మంత్రి పదవులకోసం అర్రులు చాస్తూ ఉంటారు. కనుక ఆ పార్టీని దెబ్బతీయడం కేంద్రంలో ఉన్న పార్టీకి సులభం.

ఈ బిల్లు ప్రవేశపెట్టేందుకు మోదీ ప్రభుత్వానికి అనేక కారణాలున్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మద్యం కుంభకోణంలో అరెస్టయి 156 రోజులు జైలులో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగారు. ఆయన మంత్రివర్గంలో ఉన్న సత్యేంద్ర జైన్ హవాలా కేసులో అరెస్టయినప్పటికీ చాలా కాలం మంత్రి పదవిలో కొనసాగారు. తమిళనాడులో కూడా డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి స్టాలిన్ తన మంత్రి సెంథిల్ బాలాజీ అరెస్టయి జైలుపాలైనప్పటికీ అతడిని మంత్రివర్గంలో కొనసాగించారు. మంత్రివర్గం నుంచి తొలగించాలని గవర్నర్ రవి ఆదేశించినప్పటికీ స్టాలిన్ ఒప్పుకోలేదు. నిజానికి గతంలో ఆరోపణలు వచ్చినా, కోర్టు వ్యాఖ్యలు చేసినా, తమ మంత్రిత్వశాఖ పరిధిలో ఏవైనా దుర్ఘటనలు జరిగినా మంత్రులు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేసేవారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాపిటేషన్ ఫీజులపై హైకోర్టు తప్పుపట్టడంతో ప్రధానమంత్రి పీవీ నరసింహారావు అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డిని రాజీనామా చేయించారు. కర్ణాటక ముఖ్యమంత్రిగా ఉన్న యడ్యూరప్ప, తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్న జయలలిత, బిహార్ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్, జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్ తమను అరెస్టు చేయకముందే పదవులనుంచి తప్పుకున్నారు. రాజకీయ నాయకులు చాలా మందికి ఈ అరెస్టుల వల్ల పెద్దగా నష్టం జరిగిన దాఖలాలు లేవు. హేమంత్ సోరెన్ జైలు నుంచి వచ్చిన తర్వాత ఎన్నికల్లో పోరాడి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. లాలూప్రసాద్ తాను అరెస్టయ్యే ముందు రబ్రీదేవిని ముఖ్యమంత్రి చేసినప్పటికీ ఆయన ప్రభుత్వం పడిపోలేదు. జయలలిత తాను అరెస్ట్ అయిన రెండుసార్లూ ఒకసారి పన్నీర్‌సెల్వన్‌ను, రెండవసారి పళనిస్వామిని ముఖ్యమంత్రి చేశారు. రెండుసార్లూ ఆమె ప్రభుత్వానికి పెద్దగా ధోకా రాలేదు.

## 'మీ వైఖరితో కొందరు సంతోషంగా లేరు.. అందుకే': మోదీకి మద్దతుగా ఫిజీ పీఎం వ్యాఖ్యలు




దిల్లీ: అమెరికా టారిఫ్‌ల వేళ భారత్‌కు ఫిజీ ప్రధాని సితివేణి లిగమామద రబుక కీలక వ్యాఖ్యలు చేశారు. అగ్రరాజ్యం నుంచి ఎదురవుతోన్న సవాళ్లను ప్రధాని నరేంద్రమోదీ ఎదుర్కోగలరని విశ్వాసం వ్యక్తంచేశారు . ఇరుదేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేసుకునేదిశగా ఆయన మూడు రోజులు భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈసందర్భంగా దేశ రాజధాని దిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడారు.

"టారిఫ్‌ల గురించి ప్రకటనలు చూసిన తర్వాత నేను పీఎం మోదీ కి ఒక మాట చెప్పాను. కొందరు మీ వైఖరితో కొందరు సంతోషంగా లేరు. కానీ మీరు ఎలాంటి అడ్డంకులైనా ఎదుర్కోగలరు. రెండు పెద్దదేశాలు ఘర్షణ పడినప్పుడు ఆ ప్రభావం చిన్నదేశాలపై పడుతుంది. ఇంట్లో చిన్నవాడు ఆ వ్యవహారాలతో సౌకర్యంగా ఉండలేడు. కూర్చొని చూడటం తప్ప ఏమీ చేయలేడు" అని 'ఓషన్ ఆఫ్ పీస్' పేరిట ఆయన మాట్లాడారు. రష్యా నుంచి ముడి చమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు అమెరికా విధించిన అదనపు సుంకాలు నేటినుంచి అమలవుతోన్న సంగతి తెలిసిందే

అమల్లోకి 50% సుంకాల భారం

మూడు రోజుల పర్యటనలో భాగంగా రబుక ఆదివారం దిల్లీకి వచ్చిన సంగతి తెలిసిందే. భారత్‌ను సందర్శించిన తొలి ఫిజీ ప్రధాని ఈయనే. ఈ పర్యటనలో భాగంగా మోదీతో సమావేశమయ్యారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతికి సంయుక్తంగా కృషి చేయాలని రెండు దేశాలు ప్రతినబూనాయి. వైద్యం, నైపుణ్యాభివృద్ధి, వ్యాపారం వంటి ఏడు ఒప్పందాలపై ఇరుదేశాలు సంతకాలు చేశాయి. ఈసందర్భంగా 'రక్షణ, భద్రత రంగంలో పరస్పర సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించుకున్నాం' అని మోదీ (%వీసీఒఱ%) తెలిపారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశంగా చేరేందుకు భారత్‌కు మద్దతిస్తామని ఫిజీ ప్రధాని పేర్కొన్నారు.

## అభిమానులను తోసేసిన దృశ్యాలు.. నటుడు విజయ్‌పై కేసు నమోదు



ప్రముఖ నటుడు, తమిళిగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ అధినేత విజయ్ పై కేసు నమోదైంది. మదురైలో జరిగిన టీవీకే పార్టీ కార్యక్రమంలో తనపై దాడి జరిగిందని శరత్‌కుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. నటుడిని కలిసేందుకు ప్రయత్నించగా.. బౌన్సర్లు తనపై దాడికి పాల్పడ్డారని బాధితుడు ఆరోపించారు. దీంతో పోలీసులు విజయ్, ఆయన బౌన్సర్లపైనా కేసు నమోదు చేశారు.

ఆగస్టు 21న జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇటీవల బయటికొచ్చింది. ఆ రోజున మదురైలో టీవీకే పార్టీ మహానాడు కార్యక్రమం జరిగింది. దానికి లక్షలాది మంది కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. విజయ్ వేదిక మధ్యలో ఉన్న ర్యాంప్‌పై నడుచుకుంటూ వారికి అభివాదం చేశారు. ఆ సమయంలో అతడిని చూసేందుకు కొందరు అభిమానులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ర్యాంప్ పైకి దూకి అతడిని కలిసేందుకు ప్రయత్నించారు. నటుడు విజయ్ బౌన్సర్లు వారిని అడ్డుకొని ర్యాంప్ పైనుంచి తోసేశారు.

**భాజపా కొత్త అధ్యక్షుడి ఎన్నికకు సన్నాహాలు!**

ఈ క్రమంలోనే విజయ్ బౌన్సర్లు తనపై దాడి చేశారంటూ శరత్‌కుమార్ పెరంబలూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడి ఫిర్యాదు మేరకు పోలీసులు విజయ్, అతడి బౌన్సర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తమిళనాడులో 2026లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. తమిళిగ వెట్రి కళగం పార్టీతో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన విజయ్.. రానున్న శాసనసభ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా సమావేశాలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. మదురైలో జరిగిన సమావేశంలో విజయ్ మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో టీవీకే, డీఎంకే మధ్యే ప్రధాన పోటీ ఉంటుందన్నారు. భాజపా రాష్ట్రంలో అడుగుపెట్టలేదని విమర్శించారు.

## జైసల్మేర్‌లో జురాసిక్ పార్కు!

ప్రాచీన కాలంలో మన దేశంలో డైనోసార్లు, వాటిని పోలిన జంతువులు విరివిగా సంచరించాయని చెప్పేందుకు మరికొన్ని బలమైన ఆనవాళ్లు లభించాయి. రాజస్థాన్‌లోని జైసల్మేర్ సమీప మెఘా గ్రామంలో 20 కోట్ల సంవత్సరాల క్రితం నాటి ఫైటోసార్ శిలాజాన్ని భూగర్భజలశాస్త్రవేత్త డాక్టర్ నారాయణ్‌దాస్ ఇంఖియా నేతృత్వంలోని బృందం తాజాగా గుర్తించింది. 1.5 నుంచి 2 మీటర్ల పొడవున్న ఈ శిలాజం... మొసలి ఆకృతిని పోలి ఉంది. జురాసిక్ యుగంలో ఇక్కడ డైనోసార్లతో పాటు సరీసృపాలు సంచరించాయని, ఫైటోసార్ జీవులు పరిణామ క్రమంలో ఇప్పుడు మనం చూస్తున్న మొసళ్లుగా రూపాంతరం చెంది ఉంటాయని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. నీటిలోనూ నేలపైన జీవించే ఉభయచర జీవి ఈ ఫైటోసార్. కోట్ల ఏళ్ల క్రితం ఇక్కడ ప్రవహించిన నదిలో లభించే చేపలను ఆహారంగా తీసుకుంటూ జీవించి ఉంటుందని అంచనా వేస్తున్నారు. 2023లోనూ డైనోసార్‌కు చెందిన శిలాజ అండాన్ని జైసల్మేర్ ప్రాంతంలో నారాయణ్‌దాస్ గుర్తించారు. 2018లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైన డైనోసార్ శిలాజాన్ని గుర్తించారు.

## తెలంగాణలో భారీ వర్షాలు..
### పలు రైళ్ల రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లను రద్దు చేసింది. మరి కొన్నింటిని దారిమళ్లించింది. బుధవారం.. కరీంనగర్-కాచిగూడ, కాచిగూడ-నిజామాబాద్, కాచిగూడ- మెదక్, మెదక్-కాచిగూడ, బోధన్-కాచిగూడ, ఆదిలాబాద్ - తిరుపతి, గురువారం.. నిజామాబాద్ - కాచిగూడ సర్వీసును రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు. మహబూబ్‌నగర్ - కాచిగూడ, షాద్‌నగర్ కాచిగూడ సర్వీసును పాక్షింగా రద్దు చేసినట్టు పేర్కొన్నారు. కామారెడ్డి - బికనూర్ - తలమడ్ల, అకన్పేట్ - మెదక్ రైల్వే ట్రాక్ పైనుంచి వరద ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏ ర్పడింది. రైళ్ల రద్దు, దారి మళ్లింపు సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. రైళ్ల రద్దుకు సంబంధించి హెల్ప్ లైన్ నంబర్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

హెల్ప్‌లైన్ నంబర్లు..
కాచిగూడ - 9063318082
నిజామాబాద్ - 970329671
కామారెడ్డి - 9281035664
సికింద్రాబాద్ - 040 - 277 86170

## వరద నీటిలో చిక్కుకున్న వారికి డ్రోన్ల సాయంతో ఆహారం చేరవేత

మొదటి పేజీ తరువాయి

సిరిసిల్ల: రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్ని ప్రాజెక్టులకు వరద ప్రవాహం పెరుగుతోంది. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం ఎగువ మానేరు ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో నిర్మాల వద్ద ప్రాజెక్టు అవతలివైపు పశువులను మేపేందుకు వెళ్లిన ఐదుగురు అక్కడే చిక్కుకుపోయారు. సమాచారం అందుకున్న జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేశ్ సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రప్పించి వారిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. వరదతో చిక్కుకుపోయిన వారికి డ్రోన్ సహాయంతో ఆహార పదార్థాలను సరఫరా చేసినట్లు తెలిపారు.

## ప్రాణం తీసిన రీల్స్ సరదా..
### బైక్‌పై స్టంట్లు చేస్తూ విద్యార్థులు మృతి

మొదటి పేజీ తరువాయి

సోషల్ మీడియా లో ఫేమస్ అయ్యేందుకు, లైకుల కోసం రీల్స్ చేస్తూ కొందరు యువత తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. బైక్‌పై ప్రమాదకరంగా రీల్స్ చేస్తూ.. ఇద్దరు పదో తరగతి విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన బిహార్‌లో చోటుచేసుకుంది. బుధవారం ఉదయం పట్నాకు చెందిన శుభం, ఆనంద్ కుమార్, సోను కుమార్ అనే ముగ్గురు విద్యార్థులు రీల్స్ చేయడానికి బైక్‌పై ముంగేర్‌లోని జాతీయ రహదారి 80పైకి వెళ్లారు. వేగంగా బైక్ నడుపుతున్న క్రమంలో రహదారిపై ఆగిఉన్న బస్సును గమనించకుండా ఢీ కొట్టడంతో శుభం, ఆనంద్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సోనూ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది.

ముగ్గురు స్నేహితులు బైక్‌పై రీల్స్ చేస్తున్న సమయంలో బైక్ నడుపుతున్న యువకుడు నియంత్రణ కోల్పోడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. ప్రమాదకరంగా రీల్స్ చేయవద్దని ఎన్ని రకాలుగా ప్రచారం చేస్తున్నప్పటికీ యువత తరచూ ఈ విధంగా ప్రమాదాల బారిన పడుతున్నారని ముంగేర్ ఎస్పీ ఇమ్రాన్ మసూద్ అన్నారు.

## గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో భారీ వర్షం..
## స్తంభించిన జనజీవనం

మొదటి పేజీ తరువాయి

దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్పందించిన పోలీస్ సిబ్బంది వన్‌వే ద్వారా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. వరద ప్రవాహాన్ని గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, ఏసీపీ నర్సింహులు పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్, రెవెన్యూ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు.

మరోవైపు భారీ వర్షాలకు గజ్వేల్ నియోజకవర్గవ్యాప్తంగా కుంటలన్నీ నిండుకొని అలుగుపారుతున్నాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పొలాల్లోకి వర్షపు నీరు చేరడంతో పంటలు నీటమునిగాయి. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జనజీవనం స్తంభించింది. వినాయక చవితి రోజు ఉదయం నుంచి వర్షం పడుతుండటంతో నవరాత్రి ఉత్సవాలకు ఆటంకాలు ఎదురయ్యాయి. యువకులు వర్షంలోనూ గణనాథులను మండపాలకు తీసుకెళ్లారు.

## బిల్లులను ఆమోదించాల్సింది రాష్ట్రపతి, గవర్నర్లే
### న్యాయస్థానాలకు ఆ అధికారం లేదు
### సుప్రీంకోర్టులో భాజపా పాలిత రాష్ట్రాల వాదనలు



దిల్లీ: రాష్ట్ర శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలపడం, తిరస్కరించడం లేదా తమ వద్దే నిలిపి ఉంచుకునే అధికారాన్ని రాజ్యాంగం.. రాష్ట్రపతి, గవర్నర్లకు మాత్రమే ఇచ్చిందని భాజపా పాలిత రాష్ట్రాలు పేర్కొన్నాయి. ఈ విషయంలో జోక్యం చేసుకునే అధికారం న్యాయస్థానాలకు లేదంటూ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు మంగళవారం వాదనలు వినిపించాయి. మహారాష్ట్ర తరఫున సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే మాట్లాడుతూ..'రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపేలా అధికారిక విధులు నిర్వర్తించాలని గవర్నర్లను న్యాయస్థానం ఆదేశించరాదు. చట్టానికి కోర్టు ఆమోదం తెలుపలేదు. ఆ విధి నిర్వర్తించాల్సింది గవర్నర్లు లేదా రాష్ట్రపతి మాత్రమే'నని పేర్కొన్నారు. శాసనసభలు పంపించిన బిల్లులపై రాజకీయ సంప్రదింపుల తర్వాత గవర్నర్లు, రాష్ట్రపతి నిర్ణయం తీసుకుంటారని, దీనికి ఎంత సమయమైనా పట్టవచ్చని హరీశ్ సాల్వేపేర్కొన్నారు. శాసనసభ 2020లో ఆమోదించి పంపించిన బిల్లును 2025 వరకు కూడా గవర్నర్ తన వద్దే పెండింగ్‌లో ఉంచితే ఎలా? ఆర్థిక బిల్లులను కూడా నిరవధికంగా నిలిపివేస్తారా? ఇలాంటి పరిస్థితుల్లో జోక్యం చేసుకునే అధికారం కోర్టులకు లేదా?.. అంటూ అంతకుముందు ధర్మాసనం ప్రశ్నించింది. శాసనసభలు పంపించిన బిల్లుల ఆమోదానికి తనకు గడువును నిర్దేశించడంపై పలు ప్రశ్నలు సంధిస్తూ రాష్ట్రపతి కోరిన అభిప్రాయంపై జరుగుతున్న విచారణలో భాగంగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ముందు మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, గోవా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలు కూడా వాదనలు వినిపించాయి. రాష్ట్రపతి, గవర్నర్ అధికారాల్లో కోర్టుల జోక్యం తగదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయి. రాజ్యాంగ ధర్మాసనంలో సీజేఐ జస్టిస్ గవాయ్‌తో పాటు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు.

# ఆర్మూర్ లో రక్షా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యములో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

**ఆర్మూర్, కరపత్రం ప్రతినిధి ఆగస్టు (27)**

ఆర్మూర్ లో నీ జిరాయత్ నగర్ లో మట్టి గణపతులను పూజిద్దాం-పర్యావరణాన్ని రక్షిద్దాం అనే నినాదముతో వినాయక చవితి పండుగ సందర్భంగా ఈరోజు రక్షా స్వచ్ఛంధ సేవా సంస్థ ఆర్మూర్ వారి ఆధ్వర్యములో ఆర్మూర్ పట్టణములోని జిరాయత్ నగర్ లో ప్రతి ఒక్కరు మట్టి గణపతులను పూజించాలని కోరుతూ ఉచితంగా మట్టి గణపతుల విగ్రహాలను పంపిణి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఖాందేష్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టర్ అఫ్ ప్యాలస్ (పి ఓ పి) వల్ల పర్యావరణానికి ఎంతో ముప్పు వుందని తెలియచేస్తూ, ప్రజలకు పర్యావరణ పరిస్థితుల గురించి అవగాహన కల్పించారు. స్వచ్ఛంధ సంస్థ ప్రధాన కార్యదర్శి విద్యా ప్రవీణ్ పవార్, ఉపాధ్యక్షులు జిందమ్ నరహరి మాట్లాడుతూ గత 2014 నుంచి మా సంస్థ తరపున మట్టి గణపతులను ఉచితంగా పంపిణి చేస్తున్నామన్నారు. గతములో పర్యావరణం గురించి అవగాహన ర్యాలీలు కూడా నిర్వహించామన్నారు, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు



ఖాందేష్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సంస్థ ప్రధాన కార్యదర్శి విద్యా ప్రవీణ్ పవార్ ప్రాజెక్ట్ చైర్మన్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు జిందం నరహరి, విద్యా గోపి కృష్ణ పట్వారి, కోశాధికారి గోనె శ్రీధర్, కార్యనిర్వాహక కార్యదర్శులు డాక్టర్ బేతు గంగాధర్, ఖాందేష్ సత్యం, తులసి పట్వారి, సభ్యులు నరేష్, సాయి కుమార్, వినోద్, రమేష్, సాగర్, రఘు, తదితరులు పాల్గొన్నారు.

# సుధాకర్ రెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు

**సంగారెడ్డి జిల్లా కరపత్రం ప్రతినిధి ఆగస్టు 27.**

సంగారెడ్డి జిల్లా మునిపల్లి రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి తన ఇంటి వద్ద మాట్లాడుతూ, విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, అభివృద్ధిలో ముందడుగు వేయాలని ఆకాంక్షించారు. రాయికోడ్




మండల ప్రజలకు, జిల్లా ప్రజలకు, వివిధ మ0డలాల నాయకులకు, కార్యకర్తలకు అధికారులకు వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తిశ్రద్ధలతో వినాయకుడిని ప్రార్థించి అనుగ్రహం పొందాలని సూచించారు.

# బీజేపీ ములుగు జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ గా డ్యాగల సలేందర్ నియామకం

**కరపత్రం ప్రతినిధి ములుగు**

పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న ప్రతి కార్యకర్తకు బీజేపీలో సముచిత స్థానం దక్కుతుందని కోరుకుంటూ బీజేపీ రాష్ట్ర పార్టీ సూచన మేరకు నాకు జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ గా బాధ్యత ప్రకటించినందుకు బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాంకి, రాష్ట్ర అధ్యక్షులు న్.రామచందర్ రావుకి, నాతోటి జిల్లా పదాధికారులందరికి అందరికీ పేరు పేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ అదేవిధంగా నాతో పాటు నూతనంగా ఎన్నికైన జిల్లా పదాధికారులకు శు భాకాంక్షలు తెలుపుతూ నాపై విశ్వాసంతో ఉన్న పెద్దలందరికి పార్టీ బలోపేతానికి, స్థానిక సంస్థల




ఎన్నికల పై నా శాయశక్తులా శక్తీ వంచన లేకుండా పార్టీని ముందుకు తీసుకెళ్తానని బీజేపీ పార్టీలో కార్యకర్తలు, నాయకులు అందరు ప్రధాని మోడీ నాయకత్వంలో పనిచేస్తారని ఇప్పుడు రాష్ట్రంలో బీజేపీ క్రేజ్ పెరిగిందందని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ విజయ దుందుభి మోగిస్తుందని తెలుపుతూ ప్రతి కార్యకర్త సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేయడంలో ముందు ఉండాలని యువత రాజకీయ నాయకుల కీలు బొమ్మల్ల కాకుండా రాజకీయాలలో ముందుండాలని మోదీ కోరుకునేది కూడా అదే అని అన్నారు.రాష్ట్రంలో రెండు పార్టీల పరిపాలన తీరు యావత్తు రాష్ట్ర ప్రజలకు అర్థమైందని బీజేపీ పాలిత రాష్ట్రాల పనితీరు చూస్తున్నారని రాబోయే రోజులు బీజేపీకి పట్టం కట్టం కడతారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# వాగులను సందర్శించిన ఎస్పీ పారితోష్ పంకజ్



**సంగారెడ్డి జిల్లా/ కరపత్రం ప్రతినిధి ఆగస్టు 27.**

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పారితోష్ పంకజ్ సూచించారు. బుధవారం ఆయన నారాయణఖేడ్ మండలంలోని మద్వార్, హనుమంతరావుపేట గ్రామాల్లో ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులను పరిశీలించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న ప్రాంతాల్లోని రహదారులను తాత్కాలికంగా మూసివేయాలని డీఎస్పీ వెంకట్ రెడ్డిని ఆదేశించారు. ఏదైనా ప్రమాదకర పరిస్థితి ఉంటే డయల్ 100కు కాల్ చేసి తెలియజేయాలని ప్రజలకు సూచించారు.

# నీట మునిగిన కాలనీ, స్వయంగా పరిశీలించిన జహీరాబాద్ ఎమ్మెల్యే

**జహీరాబాద్/ ఆగస్టు27 కరపత్రం ప్రతినిధి**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజక పరిధిలో కుండ పోత వర్షానికి పట్టణ పరిధిలోని డ్రీమ్ ఇండియా కాలనీ, ఇతర ప్రాంతాలు నీట మునిగాయి ,ఇళ్లల్లోకి నీరు చేరింది. విషయం తెలుసుకున్న శాసనసభ్యులు కొనింటి మాణిక్ రావు కాలనీలలో స్వయంగా వరద నీటిలోనికి దిగి నీట మునిగిన ఇళ్లను, ప్రవాహాన్ని స్వయంగా తమ ఫోన్ లో ఫోటోలు తీసి ఉన్నత అధికారులకు పంపించారు. అధికారులతో స్వయంగా చరవాణి ద్వారా మాట్లాడారు. కాలనీ వాసులతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నీట మునిగిన ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ఆధైర్య పడకండి అండగా ఉంటానని వారికి ధైర్యాన్ని



ఇచ్చారు. వర్షపు నీటిని బయటకు పంపించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అక్కడికి వచ్చిన అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. వర్షం కురుస్తున్నందున అధికారులు పర్యవేక్షిస్తూనే ఉండాలని తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి ఏమైనా



ఇబ్బందులు ఉంటే అధికారులకు తెలియజేయాలని ప్రజలకు తెలియజేశారు.ఎమ్మెల్యే గారితో పాటు గా మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు ....

# వినాయకుడికి సీఎం రేవంత్ రెడ్డి పూజలు

**సంగారెడ్డి జిల్లా/ కరపత్రం ప్రతినిధి ఆగస్టు 27.**

వినాయక చవితి సందర్భంగా సీఎం రేవంత్ విఘ్నేశుడికి పూజలు నిర్వహించారు. జూబ్లీహిల్స్లోని తన నివాసంలో కుటుంబసభ్యులతో కలిసి ఆయన పూజలు చేశారు. వేద పండితులు సీఎం కుటుంబసభ్యులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎం సతీమణి గీత, కుమార్తె నైమిషా రెడ్డి దంపతులు, మనవడు రేయాన్ పాల్గొన్నారు.



# కుల మతాలకు అతీతంగా వినాయక చవితి ఉత్సవాలు సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్

**సంగారెడ్డి జిల్లా. కరపత్రం ప్రతినిధి/ఆగస్టు 27**

జహీరాబాద్ పట్టణంలోని భరత్నగర్ కాలనీలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గతంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మంజూర్ అహ్మద్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ఉత్సవాలు నేటికీ అదే స్ఫూర్తితో కొనసాగుతున్నాయి. శ్రీ హనుమాన్ వినాయక కమిటీ ఆధ్వర్యంలో యువకులు చురుకుగా ముందడుగు వేసి, కులమతాలకు అతీతంగా



అందరూ కలిసికట్టుగా పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలుద్దీన్ మాట్లాడుతూ వినాయక ఉత్సవాలు సామాజిక ఐక్యతకు ప్రతీక. ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఈ ఉత్సవాలను కులమతభేదాలు లేకుండా జరుపుకోవడం ఎంతో గొప్ప విషయం అని అన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మహిపాల్ రెడ్డి, సిద్ధారెడ్డి, అలాగే స్థానిక యువకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు. గణనీయంగా జనసమూహం హాజరై ఉత్సవాలను మరింత ఉత్సాహవంతంగా మార్చింది.

# జిల్లాలో ముగిసిన ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ

**సంగారెడ్డి జిల్లా/ కరపత్రం ప్రతినిధి ఆగస్టు 27.**




సంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ పూర్తయిందని డీఈఓ వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. 40 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు గెజిటెడ్ ప్రధానోపాధ్యా యులుగా, 190 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించిందన్నారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులందరూ వెంటనే నూతన పాఠశాలల్లో చేరాలని ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు

# వాడవాడలలో కొలువు దీరిన గణపయ్యలు



## - పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దామోదర రాజనర్సింహ

**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వినాయక చవితిని పండగ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం వాడవాడలలో వినాయక మండపాలను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో ఆ గణనాథుని పూజించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తన ఇంట్లో మట్టి గణపయ్యను పూజించి అందరిని చల్లంగా



చూడాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలతో పాటు ముఖ్యంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఆందోల్ నియోజకవర్గ ప్రజలందరికి ఆయన పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. సంగారెడ్డి జిల్లా అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో జోగుపేట వాసవి నగర్, భరత్ నగర్, సూర్య యూత్, శ్రీ పోచమ్మ దేవాలయం, రాజరాజేశ్వర దేవాలయం, హనుమాన్, అందోలు రంగనాథ స్వామి దేవాలయం వద్ద వినాయక మండపాలను అందంగా తీర్చిదిద్దారు. వర్షం కారణంగా కొంత ఆలస్యంగా



పూజా కార్యక్రమంలో ప్రారంభించుకున్నారు. గణపయ్యల వద్దకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భరత్ నగర్ లోని వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుని వద్ద సంఘ సేవకులు పట్లోళ్ల సురోత్తం రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అందర్నీ చూడాలని చల్లంగా చూడాలని ఆ గణపయ్యని వేడుకున్నారు.

# రాబోయే 2 గంటల్లో భారీ వర్షాలు

## మేడ్చల్ జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ

**కరుణాకర్ మల్లిగారి,కరపత్రం ప్రతినిధి**

రాబోయే 2 గంటల్లో హైదరాబాద్, కామారెడ్డి, మెదక్, మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయబడింది.



మిగిలిన 24 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేయబడింది.

# కమిషనరేట్ హెడ్ క్వార్టర్స్ లో ఘనంగా వినాయక చవితి వేడుకలు





**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయం వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయం లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా అధికారులతో కలిసి పాల్గొని పూజా కార్యక్రమం నిర్వహించి తీర్థప్రసాదాలు తీసుకొన్నారు.సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఈ వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించుకోవాలని, అందరు తాము మొదలు పెట్టిన పనులు ఎలాంటి విఘ్నాలు లేకుండా పూర్తి అయ్యేటట్లు చూడాలని, కష్టాలను తొలగించి ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని మహాగణపతిని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, ముఖ్యంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ప్రజలలో ఉన్న సోదరభావం, ఐక్యత ఎంతో సంతోషాన్ని కలిస్తుందని, పోలీసు శాఖ సూచించిన మేరకు ఆయా మండపాల వద్ద నిర్వాహకులు, యువత పోలీస్ వారి సూచనల ప్రకారం జాగ్రత్తలు తీసుకుంటున్నారని, ఇదేరీతిలో ఈరోజు నుండి నిమజ్జనం రోజు వరకు ప్రతి ఒక్కరు పోలీస్ వారికి సహకరించాలని ఎటువంటి ఆటంకాలు లేకుండా నవరాత్రులు, నిమజ్జన శోభయాత్ర నిర్వహించుకోవాలని ప్రజలకు సీపీ తెలిపారు. పూజా కార్యక్రమంలో గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, రామగుండం సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వర్ రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ భీమేష్, ఆర్ ఐ దామోదర్, శ్రీనివాస్, శేఖర్,మల్లేశం, సిసి హరీష్, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చౌటకూర్లో భారీ వర్షం.. పంట పొలాల్లోకి వరదనీరు



**సంగారెడ్డి జిల్లా/ కరపత్రం ప్రతినిధి**
చౌటకూర్ మండల కేంద్రంలో అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. చౌటకూర్ నుంచి కొన్యాల వెళ్లే రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తోంది. ఈ వర్షాల కారణంగా పంట పొలాల్లోకి నీరు చేరడంతో పంటలు నీట మునిగాయి. వాతావరణ శాఖ మరో రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయని హెచ్చరించడంతో, పంటలు దెబ్బతింటాయని రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

# నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి



**కరపత్రం ప్రతినిధి ఆగస్టు 27**
వాంకిడి మండల కేంద్రంలో ఎంపీడీవో ఆఫీస్ కార్యాలయం ముందు ఆమరణ నిరాహార దీక్ష మూడవరోజు చేపట్టారు. ఇందిరమ్మ ఇల్లు అనాహురులకు కాకుండా అర్హులకు మాత్రమే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బి జె వై ఎం రాష్ట్ర అధికారి ప్రతినిధి సుచిత్ కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఈ దీక్షలో పలువురు బిజెపి నాయకులు రామగిరి విశాల్, ఏకబెల్లం నరేందర్, బీజవైఎం మండల అధ్యక్షులు మండోకర్ వికాస్, ప్రశాంత్ తదితర నాయకులు పాల్గొన్నారు

# వర్షంలో కూడా ఆగని అన్నదానం

## - వినాయక చవితి శుభాకాంక్షలు







**కరపత్రం ప్రతినిధి వేములవాడ ఆగస్టు 27**
మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1587 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజున లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ రాజన్న భీమేశ్వర ఆలయం వద్ద పేదలకు, అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్న దాతలుగా వేములవాడ వాస్తవ్యులు కుమారుని పుట్టినరోజు సందర్భంగా ఈశ్వరగారి కాశినాథ శర్మ రాజమణి దంపతులు, శాశ్వత దాతలుగా జువ్వాడి వెంకటేశ్వరరావు స్నేహలత దంపతులు, ప్రతాప స్వప్న సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత, కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్చంద్ర దంపతులు, శిరీష సాయిచంద్ర దంపతులు, శర్వాణి రవిచంద్ర దంపతులు, హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ ఉన్నారని, ఒక్క పూటైనా పేదలకు భోజనం అందించడానికి సహకారం అందించే దాతలు ట్రస్టు సభ్యులను గాని 9246939388 నంబరుకు సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, డాక్టర్. బెజ్జంకి రవీందర్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, ఏలేశ్వరపు సాయినాథ్, సగ్గు రాహుల్, చింతపంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ఘనంగా శ్రీ విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం.



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**
అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి స్థానిక కరీంనగర్ లోని అల్ఫోర్స్ విద్యా సంస్థల్లో ఏర్పాటు చేసినటువంటి గణపతి మండపాలలో మట్టి గణపతులను ప్రతిష్టించి మొదటి రోజు పూజలో పాల్గొన్నారు. వినాయకుని పూజ చేయడం వలన సకల శుభాలతో పాటు అడ్డంకులు తొలగిపోతాయని , విజయాలను అందజేస్తుందని తెలిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు మన దేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో సైతం చాలా ఉత్సాహంగా కుటుంబ సభ్యుల ఆనందోత్సవాల నడుమ జరుపుకోవడం గొప్ప విషయమని తెలిపారు.తల్లిదండ్రుల ప్రేమకు ప్రతీక అయినటువంటి గణపతి యొక్క స్తోత్రాలను పఠించిన వారికి నిత్యం శుభ ఫలాలు కలుగుతాయని పలు పురాణాల ద్వారా ఇవి విషయాలు మనకు స్పష్టంగా తెలుస్తుందని వారు గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరూ పూజా కార్యక్రమాలు చేపట్టాలని ప్రపంచశాంతికి మార్గాన్ని సుగమం చేయాలని సూచించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం సైతం పర్యావరణహితంగా, పర్యావరణానికి మేలు కలిగించే విధంగా మట్టి గణపతులను ప్రతిష్టించిన జరిగినదని వారు గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా మెదిలి వనరుల సంరక్షణకు ముందంజలో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో వినాయక చవితి.



**దమ్మపేట, ఆగష్టు 27 కరపత్రం ప్రతినిధి**
అశ్వరావుపేట నియోజకవర్గ పరిధిలో అన్ని మండలాలలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి తెల్లవారుజామున నుంచి గణపతి పూజలు కీర్తనలతో అన్ని వాడల్లో మారుమోగుతున్నాయి దమ్మపేట మండలంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో కామ్రేడ్ కీర్తిశేషులు యార్లగడ్డ భాస్కరరావు ఏర్పాటు చేసిన విప్లవనగర్లో ఏర్పాటుచేసిన వినాయక ఉత్సవాల్లో వేదపండితుల చేతుల మీద పూజా కార్యక్రమాలు ప్రారంభించడం జరిగింది ఈ పూజా కార్యక్రమంలో సి.పి.ఐ దమ్మపేట మండల సహాయ కార్యదర్శి యార్లగడ్డ మణికంత,శిరీష దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నరు ఈ కార్యక్రమలో కుటుంబ సభ్యులు మరియు విప్లవ నగర్ భక్తులందరూ పాల్గొనడం జరిగింది.

# పట్టాలపై నీళ్లు: పలు రైళ్ల రద్దు.. మరికొన్ని దారి మళ్లింపు



తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు దంచి కొడుతున్నాయి. భారీ వర్షాలు పలు జిల్లాలను అతలాకుతలం చేస్తున్నాయి. దీంతో దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లను రద్దు చేయగా, మరి కొన్నింటిని దారిమళ్లించింది. కాచిగూడ-నిజామాబాద్, నిజామాబాద్-కాచిగూడ, కరీంనగర్-కాచిగూడ, కాచిగూడ-మెదక్, మెదక్-కాచిగూడ, బోధన్-కాచిగూడ, ఆదిలాబాద్-తిరుపతి సర్వీసును రద్దు చేసినట్టు రైల్లే అధికారులు ప్రకటించారు.మహబూబ్నగర్-కాచిగూడ, షాద్నగర్-కాచిగూడ సర్వీసును పాక్షింగా రద్దు చేసినట్టు అధికారులు వెల్లడించారు. కామారెడ్డి-బికనూర్-తలమడ్ల, అక్కన్నపేట్ -మెదక్ రైల్వే ట్రాక్ పైనుంచి ఉధృతంగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

# హవేలి ఘన్పూర్లో విషాదం.. వరదలో కొట్టుకుపోయిన కారు



జిల్లాలో వరద బీభత్సం సృష్టిస్తోంది. వరద ప్రవాహంలో కారు కొట్టుకుపోయింది. హవేలి ఘన్పూర్ మండలం నక్కవాగులో ఘటన జరిగింది. భారీ వర్షాలు కారణంగా నక్కవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వద్దని స్థానికులు వారించినా పట్టించుకోని కారు డ్రైవర్.. అత్యుత్సాహంతో వరద ప్రవాహంలో కారు నడిపారు. దీంతో వాగులో కారు కొట్టుకుపోయింది. కారులో ఉన్నవారి వివరాల కోసం అధికారులు ఆరా తీస్తున్నారు.కాగా, హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. తాజాగా జిల్లాలోని ధూప్సింగ్ తండా జలమయమైంది. తండాను వరద నీరు ముంచెత్తడంతో ఇళ్లలోకి నీరు చేరుకుంది. జల దిగ్బంధంలో తండా ఉండటంతో తమ కాపాడాలంటూ స్థానికులు బిల్డింగ్పైకి ఆర్తనాదాలు చేస్తున్నారు.మరోవైపు.. అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో మరో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. రాబోయే 2 గంటల్లో 8 జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తాయని తెలిపింది.

# దమ్మపేటలో కళకళలాడుతున్న వినాయక మండపాలు

**కరపత్రం ప్రతినిధి**
అశ్వరావుపేట నియోజకవర్గ పరిధిలో దమ్మపేట మండల కేంద్రంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి,తెల్లవారుజామున నుంచి గణపతి పూజలు కీర్తనలతో అన్ని బజార్లలో మారుమోగుతున్నాయి దమ్మపేట బాల గణేష్ కమిటీ ఆధ్వర్యంలో సంత బజారులో ఏర్పాటు.చేసిన వినాయక ఉత్సవాల్లో వేదపండితుల చేతుల మీద



పూజా కార్యక్రమాలు ప్రారంభించడం జరిగింది ఈ పూజా కార్యక్రమంలో విగ్రహ దాత గడ్డిపాటి వెంకట కృష్ణారావు(బాబు),నాయుడు వీరాస్వామి, శ్రీధర్ దంపతులు,దొడ్డ సుబ్బారావు, దొడ్డ సత్యనారాయణ, దొడ్డ కుమారస్వామి, దొడ్డ వినోద్, పసుమర్తి శ్రీధర్,దంపతులు. నాయుడు సుబ్బారావు,యార్లగడ్డ పోలా రావు, సిరిపురపు నాని, పలువురు భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నరు.